క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి, అమీర్‌పేట్ గ్రామంలో సీతారాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, పుష్పాలంకరణతో పాటు తమలపాకులతో అర్చన నిర్వహించారు. ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి సన్నిధిలో దంపతులు శ్రీసత్యనారాయణ వ్రతాలు జరిపారు. శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి, స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు వసతులు కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పేట్ ఆంజనేయ స్వామి ఆలయ పూజారి తొండుపల్లి సంతోష్ శర్మ, వీరేశం, ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శివ పడిపూజ

తలకొండపల్లి: మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భగవాన్‌రెడ్డి శనివారం శివ మహాపడి పూజ ఏర్పాటు చేశారు. గురుస్వాములు శంకరయ్య గౌడ్, గోపాల్‌గౌడ్, సత్యనారాయణ నరేశ్ శివ కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా శివనామ స్మరణతో ఆప్రాంతమంతా మార్మోగింది.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

తుర్కయంజాల్: ముందుగానే గుర్తిస్తే క్యాన్సర్‌కు చికిత్స అందించవచ్చునని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల భాగస్వామ్యంతో మున్సిపాలిటీ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆల్కహాల్‌కు, పొగాకు దూరంగా ఉండడం లాంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకకు అవకాశమివ్వండి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్

మంచాల: ఉపాధ్యాయుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకను శాసన మండలికి పంపద్దామని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని లింగంపల్లి, మంచాల, ఆరుట్ల, రంగాపూర్, జాపాల, ఆరుట్ల మోడల్ స్కూల్, మంచాల కేజీబీవీ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తి పోరాటం చేసే నాయకుడు, ఎస్టీయూ అభ్యర్థి భుజంగరావుకు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని కోరారు. గతంలో గెలుపొంది సమస్యలను పట్టించుకోని నేతలకు గుణపాఠం చెప్పాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు. బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పీఈటీ, పండిట్ పోస్టులకు పదోన్నతలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏవీ.సుధాకర్, ఒరిగంటి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రాజమల్లేశ్, సుదర్శన్‌రెడ్డి, పాండు, మండల అధ్యక్షుడు గఫార్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, సభ్యులు భాస్కర్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై రాజీలేని పోరాటం

పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు

మంచాల: పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు అన్నారు. శనివారం ఆయన రంగాపూర్, పెరికిరాళ్ల తండా, లోయపల్లి, చెన్నారెడ్డిగూడ గ్రామాల్లోని ఉన్నతపాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమలాకర్‌రావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరారు. ఇప్పటికే ఉపాధ్యాయుల సమస్యలను ఎన్నో పరిష్కరించామన్నారు. త్వరలోనే హెల్త్‌కార్డులు ఇప్పిస్తామన్నారు. పీఈటీ, పండిట్ పోస్టులను ఉన్నతీకరణ చేయిస్తామని చెప్పారు. సీపీఎస్ రద్దు చేయించి ఉపాధ్యాయులకు బహుమతిగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధనయాదవ్, మండల అధ్యక్షుడు రాములు, గౌరవ అధ్యక్షుడు జమీర్, ప్రధాన కార్యదర్శి సీతారాం, మండల బాధ్యులు జావిద్, వెంకటేశ్, శేఖర్, సరూర్‌నగర్ మండల గౌరవ అధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, బాధ్యులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా ఒడిస్సీ బోధన

ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఒడిశా కార్మికుల పిల్లల కోసం రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రత్యామ్నాయ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతిగదులు లేక ఇబ్బంది పడుతున్నారు.

- ప్రతీ ఏడాది డిసెంబర్ నుంచి మే వరకు నిర్వహణ
- రావిర్యాల ప్రాథమిక పాఠశాల ఏజెన్సీ నుంచి మధ్యాహ్న భోజనం
- తరగతి గదులు లేక విద్యార్థుల ఇక్కట్లు



ఒకే తరగతిలో కూర్చున్న విద్యార్థులు

తుక్కుగూడ: జిల్లాలో ఇటుక బట్టీల ఏర్పాటుతో మన ప్రాంత కూలీలతో పాటు, ఒడిశా రాష్ట్రానికి చెందిన కూలీలు ఉపాధి పొందుతున్నారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం.. 14 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలకు విద్యాబోధన అందించే ఉద్దేశంతో తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల ప్రాథమిక పాఠశాలలో ఇటుక బట్టీల యాజమాన్యం ఆధ్వర్యంలో కార్మికుల పిల్లలకు వారి మాతృభాషలో విద్యాబోధన చేస్తున్నారు.

113 మంది విద్యార్థులు హాజరు

ఈ పాఠశాల్లో 1 నుంచి 5వ తరగతి వరకు 113 మంది విద్యార్థులున్నారు. వీరు రావిర్యాల, ఆది బట్ల పరిధిలో ఉన్న ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలు. వీరు పాఠశాలకు హాజరయ్యేందుకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. వీరి బోధనకు ఒడిశాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయలను నియమించారు. ఐదేళ్లుగా నిర్వహిస్తున్న ఈ తరగతులు ప్రతీ ఏడాది డిసెంబర్‌లో ప్రారంభమై మేలో ముగుస్తాయి. రావిర్యాల ప్రాథమిక పాఠశాల ఏజెన్సీ నుంచి వీరికి మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

ఒకే గదిలో వందమంది విద్యార్థులు

రావిర్యాల ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదులు లేక ఒక గది ఒడిస్సా విద్యార్థులకు కేటాయించారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇదే ఆవరణలో ఉన్న జెడ్పీహెచ్ఎస్‌లో అదనపు గదులు ఉన్నప్పటికీ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయల మధ్య ఉన్న కోల్డ్‌వార్‌తో వీరికి తరగతి గదులను కేటాయించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ విద్యార్థులకు మరో తరగతి గదిని కేటాయించాలని కోరుతున్నారు.

మరో గది కేటాయించాలి



ఒడిస్సా ప్రాంతానికి చెందిన ఇటుక బట్టీల కూలీల పిల్లలకు బోధిస్తున్నాం. 110 మందికి పైగా విద్యార్థులున్నారు. వీరందరికి ఒకే తరగతి గది కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరో తరగతి గదిని కేటాయిస్తే విద్యార్థులపై దృష్టిసారించే వీలుంటుంది.

– సంజయ్, ఒడిశా ఉపాధ్యాయుడు

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- సర్కారు కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలి
- మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్

మీర్‌పేట: విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం కొత్తగా కళాశాలలను నిర్మిస్తుందని, విద్యార్థులు ప్రభుత్వ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్ అన్నారు. శనివారం మీర్‌పేట సర్వోదయనగర్ కాలనీలో రూ.1 కోటి 35 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను మేయర్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ మీర్‌పేటతో పాటు మండల పరిధిలోని బడంగ్‌పేట, జల్‌పల్లి ప్రాంత విద్యార్థుల కోసం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడంతో పాటు, భవన నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేశారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొంటూ.. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకోవాలని ఆమె సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు వచ్చే విద్యా సంవత్సరం నాటికి భవనాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ జాయింట్ డైరెక్టర్ ఓ.రాణి, డీఐఈఓ వెంక్యానాయక్, మీర్‌పేట ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సైదులు, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, స్థానిక కార్పొరేటర్ ధరంకార్ జ్యోతికిషోర్, అధ్యాపకులు ప్రభాకర్‌రెడ్డి, నర్సింహ్మాచారి, శ్రీధర్, రాంరెడ్డి, దుర్గ, సవిత, రాంబాబు, రామిరెడ్డి, వదిరాజ్, దుర్గారెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



మాట్లాడుతున్న సినీ నటుడు కార్తికేయ

సినీ నటుడు కార్తికేయ

మీర్‌పేట: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకుని ఉన్నతంగా రాణించాలని సినీ నటుడు కార్తికేయ అన్నారు. శుక్రవారం రాత్రి మీర్‌పేటలో నిర్వహించిన నాగార్జున మాంటిస్సోరి, ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్ 10వ వార్షికోత్సవానికి కార్తికేయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు చిన్నారుల అభిరుచి, వారిలో నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, భావవ్యక్తీకరణ పెంపొందించడానికి తమ విద్యాసంస్థల్లో కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లల కోసం సమయం కేటాయించడంతో పాటు సెల్‌ఫోన్ తదితర వాటికి దూరంగా ఉంచాలని సూచించారు. అనంతరం గతేడాది 10వ తరగతిలో 10 జీపీఏ పాయింట్లు సాధించిన 12 మంది విద్యార్థులకు రూ.5 వేలు, మెమొంటోలను ప్రదానం చేశారు. వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన వేంకటేశ్వర కల్యాణం, దశావతారాలు, శివతాండవం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ జి.రజనీ విఠల్‌రెడ్డి, డైరెక్టర్ లోహితా కార్తికేయ, సీఏఓ ఏ.శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ డి.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకునిచ్చిన మంత్రినే విమర్శిస్తావా?

- చిత్తశుద్ధి ఉంటే పదవికి రాజీనామా చేయాలి
- మేయర్ పారిజాతపై కార్పొరేటర్ల ధ్వజం

బడంగ్‌పేట్: రాజకీయ భిక్ష పెట్టిన మంత్రి సబితారెడ్డిని విమర్శించిన మేయర్ పారిజాతానికి ఏ మాత్రం ఆత్మాభిమానం ఉన్నా.. వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధికార పార్టీ నేతలు మాట్లాడారు. మంత్రి అండతో అందలమెక్కిన మేయర్ పారిజాతం.. ఈ మూడేళ్ల కాలంలో ఏనాడు ఇంటి పన్నుల గురించి కార్పొరేటర్లతో మాట్లాడలేదని, హఠాత్తుగా పన్నులు అడ్డదిడ్డంగా పెంచేశారని అనడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మనసులో దురాలోచన పెట్టుకుని మంత్రిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అభివృద్ధి జరగడం లేదని పార్టీ మారిన మేయర్ పారిజాత.. మంత్రి అండతో తెచ్చుకున్న పదవిని ఎందుకు వీడడం లేదని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు

ప్రజలపై ప్రేమతో కాదు..

ఇప్పటి వరకు కార్పొరేషన్‌కు ఎల్ఆర్ఎస్, హెచ్ఎండీఏ, ఎస్ఎన్‌డీపీ, హెచ్ఎండబ్ల్యూ, సీఎస్ఆర్, సీడీపీ, లైబ్రరీఫండ్స్, పీహెచ్ఎంఈ గ్రాంట్స్ నిధులతో రూ.472 కోట్లను తీసుకువచ్చి అభివృద్ధి చేసిన మంత్రిని విమర్శిస్తావా అంటూ నిలదీశారు. ఎమ్మెల్యే కావాలని పగటి కలలు కంటూ.. ఇంటి పన్నులను అడ్డం పెట్టుకొని మంత్రిని విమర్శిస్తున్నావు కాని.. ప్రజలపై ప్రేమతో కాదని దుయ్యబట్టారు. సొంత పార్టీ వారిని కాదని బతుకునిచ్చిన మంత్రిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో కార్పొరేటర్లు భీమిడి స్వప్న, బోయపల్లి దీపిక, ముత్యాల లలిత, జెనిగే భారతమ్మ, మమత, సంరెడ్డి స్వప్న, శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, శివకుమార్, అర్జున్, కోఆప్షన్ సభ్యులు రఘునందన్‌చారి, ఖలీల్‌పాషా, సమైక్య జ్యోతి, జగన్మోహన్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, ఆనంద్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శివపార్వతుల కల్యాణానికి రండి



డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సభ్యులు

కాంగ్రెస్ నేతలకు ఆహ్వాన పత్రికల అందజేత

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో వెలసిన అతి పురాతనమైన రామేశ్వరపుర శివాలయ దేవస్థానంలో ఈ నెల 10,11,12 తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా విగ్రహాల ప్రతిష్ఠ, పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, చిగురింత నర్సింహారెడ్డిలను శనివారం కలిసి ఆహ్వాన పత్రికలను ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, శశికాంత్, చంద్రమోహన్, శివగురుస్వాములు రవీందర్ గౌడ్, సురేందర్ గౌడ్, నరేష్, నిఖిల్ పలువురు పాల్గొన్నారు.

నిరుద్యోగులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ అన్నారు. శనివారం యూత్ కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని నేటికీ అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పాటు నుంచి నేటికీ అమరవీరుల కుటుంబాలను పరామర్శించడం లేదని మండిపడ్డారు. హామీలు అమలు చేసే వరకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ తిరుపతి రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ నర్సింహ, సుధీర్, శివ, నరేశ్, రాజుచారి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

ఆమనగల్లు: అసెంబ్లీ ముట్టడి సందర్భంగా పోలీసులు అదుపులోకి తీసుకున్న ఎన్ఎస్‌యూఐ నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆమనగల్లు మండలానికి చెందిన ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం జాతీయ రహదారిపై ఎన్ఎస్‌యూఐ నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా సంఘం సభ్యులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్, ఇతర నాయకులను విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఫరీద్, మహేశ్, సిద్దునాయక్, లక్ష్మణ్, శివ తదితరులున్నారు.

వీధివ్యాపారులకు రుణాలు ఇప్పించండి

మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి

ఇబ్రహీంపట్నం: వీధి వ్యాపారులకు బ్యాంకర్ల నుంచి రుణాలను ఇప్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి కోరారు. శనివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మెప్మా, బిల్ కలెక్టర్లతో వేర్వేరుగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వీధి వ్యాపారాలు నిర్వహించే పేదలు అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని వ్యాపారం చేస్తూ ఇబ్బంది పడుతున్నారన్నారు. అటువంటి వారికి తక్కువ వడ్డీకి బ్యాంక్ రుణాలు ఇప్పించాలని మెప్మా సిబ్బందికి సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ మాట్లాడుతూ.. పన్నులు వసూలులో బిల్ కలెక్టర్లు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి ముగిసేలోపు పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేయాలన్నారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించండి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభులింగం

ఇబ్రహీంపట్నం: పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభులింగం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలో రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం సంఘం నాయకుడు పూల యాదయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభులింగం మాట్లాడుతూ.. పంటలకు గిట్టుబాటు ధర రాక రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 55ఏళ్లు నిండిన రైతులకు రూ.5వేల పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌గౌడ్, అలీమొద్దీన్, నీలమ్మ, రాజు, విజయ్‌కుమార్, గాలయ్య, లక్ష్మయ్య, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

జీజేవై సేవా సమితి ఉపాధ్యక్షుడిగా రాజేందర్

కడ్తాల్: జీజేవై సేవా సమితి నియోజకవర్గ నూతన కమిటీని అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో శనివారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రాజేందర్, వరుణ్, ప్రధాన కార్యదర్శులుగా నరేశ్, కిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్, జీజేవై యువజన విభాగం అధ్యక్షుడిగా నరేశ్‌గౌడ్, ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేశ్, కల్వకుర్తి మండల కమిటీ అధ్యక్షుడిగా శివ, కడ్తాల మండల కమిటీ అధ్యక్షుడిగా రాజును నియమించారు. వీరికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నియామకపత్రాలు అందజేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని పునఃనిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. శనివారం గ్రామానికి చెందిన బట్టు రాఘవరెడ్డి, శంకరమ్మల జ్ఞాపకార్థం బట్టు కోదండరెడ్డి, లత దంపతులు సర్పంచ్ బట్టు అనురాధకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బట్టు కిషన్‌రెడ్డి, మాధవరెడ్డి, రాంరెడ్డి, విజేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

'హ్యాపీ ఈవెంట్ డే'లో ప్రిన్సిపాల్ రాణి

హుడాకాంప్లెక్స్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.రాణి అన్నారు. శనివారం జూనియర్ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలును పురస్కరించుకుని హ్యాపీ ఈవెంట్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులంతా పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతీ విద్యార్థికి కళాశాల దశ కీలకమని, సమయాన్ని వృథా చేయకుండా గమ్యంవైపు అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ప్రాంగణాన్ని ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచడంలో తమ సహాయ, సహకారాలు అందిస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్ సురేశ్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు స్వామి, సూర్యను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.



శానిటేషన్ సిబ్బందిని సన్మానిస్తున్న జూనియర్ కళాశాల అధ్యాపక బృందం

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురిలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం సప్తదశ ఆలయ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయంలో ప్రసన్నాంజనేయస్వామికి విశేష పంచామృతాభిషేకం, సమస్రనామర్చాన, రుద్రహోమం, మన్యు పాశుపత హోమం, భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారికి శివ సహస్రనామ పారాయణం సహిత సహస్రఘటాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1000కి పైగా కలశ జలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శృంగేరి శంకరమఠం బ్రాంచ్ హెడ్ శ్రీనివాస్, నిర్వాహకులు గౌరి శంకర్, విశ్వనాథ శోభనాద్రి, సూర్యనారాయణరావు, గౌరి భాస్కర్, ముదికొండ శంకరశర్మ, సూరి వ్యాస్‌కుమార్, నరసింహమూర్తి, సుధాకర్ వర్మ పాల్గొన్నారు. ఆలయ సప్తదశ ఆలయ వార్షికోత్సవాలు సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు దేవాయలంలో శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామివారి వ్రతం, అనంతరం కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అర్హులైన రైతులకు న్యాయం

తహసీల్దార్ సుచరిత

యాచారం: అర్హులైన అసైన్డ్ రైతులకు అన్యాయం జరగనివ్వనని.. సర్టిఫికెట్లు ఉండి, కబ్జాలో ఉన్న రైతుల పేర్లను ధరణి పోర్టల్‌లో నమోదు చేయించి పట్టాదారు పాసుపుస్తకాలు అందేలా కృషి చేస్తానని తహసీల్దార్ సుచరిత అన్నారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లోని సర్వే నంబరు 5, 17, 46లలో శనివారం ఆమె పర్యటించా రు. ఎంత మందికి అసైన్డ్ సర్టిఫికెట్లు వచ్చాయి.. సర్టిఫికెట్లలో ఉన్న భూ రికార్డుల ప్రకారం రైతులు కబ్జాలో ఉన్నారా.. నకిలీ సర్టిఫికెట్లున్నాయా అనే వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నకిలీ రికార్డులను తీసేసి బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటానన్నారు.



అసైన్డ్ భూముల పరిశీలనలో తహసీల్దార్ సుచరిత